
కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక దశలో మూత్రశాలలు, మరుగుదొడ్లు


నల్లబెల్లి మండలం రుద్రగూడెం హైస్కూల్లో అసంపూర్తిగా ఉన్న మన ఊరు మన బడి పనులు


నిర్మాణ పనుల వల్ల అపరిశుభ్రంగా ఉన్న కరీమాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల

కష్టాల వెంబడి..

- నేటి నుంచి మోగనున్న బడి గంట
- అరకొర వసతులు.. అసంపూర్తి పనులు..
- వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత
- పారిశుధ్య సిబ్బందిని నియమించని సర్కారు
- పలుచోట్ల భయపెడుతున్న శిథిల భవనాలు
- మొదటి రోజే పుస్తకాలు, యూనిఫాం పంపిణీ

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 11: అరకొర వసతులు... అసంపూర్తి పనులతోనే విద్యా సంవత్సరం ప్రారంభం కానుంది. రాష్ట్రంలో ప్రభుత్వం మారినా ప్రభుత్వ పాఠశాలల తీరు మాత్రం మారలేదు. గత ఏడాది గత ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన మన ఊరు- మనబడి అభివృద్ధి పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. కొత్త ప్రభుత్వం ప్రారంభించిన అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ఈసారి కూడా విద్యార్థులు అరకొర వసతుల నడుమనే బడిబాట పట్టాల్సిన దుస్థితి నెలకొంది. ప్రస్తుత అభివృద్ధి పనులు ఆలస్యంగా ప్రారంభించడంతో చాలాచోట్ల పనులన్నీ ప్రాథమిక దశలోనే ఉన్నాయి. పారిశుధ్య కార్మికులు లేకపోవడంతో ఆవరణలు మురికిగా దర్శనమిస్తున్నాయి. పాఠశాలల్లో నిర్మాణ సంబంధమైన అభివృద్ధి పనుల కారణంగా పాఠశాలల ప్రాంగణాలన్నీ అపరిశుభ్ర వాతావరణంలో కొట్టుమిట్టాడుతున్నాయి. అరకొర వసతుల నడుమ నేటి (బుధవారం)నుంచి వేసవి సెలవుల తర్వాత పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. జిల్లాలో ప్రభుత్వ యాజమాన్యంలో మొత్తం 1,014 పాఠశాలలు ఉండగా 1,23,663 మంది విద్యనభ్యసిస్తున్నారు. తొలి రోజే విద్యార్థులకు యూనిఫామ్‌లు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు అందజేయనున్నారు.



ఉపాధ్యాయుల కొరత తీరేనా?

ప్రభుత్వ యాజమాన్యంలో నడుస్తున్న పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. జిల్లాలో 645 పాఠశాలలు ఉండగా 3,040 మంది ఉపాధ్యాయులు పనిచేయాల్సి ఉంది. అయితే 2,540 మంది మాత్రమే పనిచేస్తున్నారు. ఇంకా 500 పోస్టులు ఖాళీలుగా ఉన్నాయి. ఇందులో స్కూల్ అసిస్టెంట్ విభాగంలో మ్యాథ్స్‌లో 18, ఫిజికల్ సైన్స్‌లో 8, బయోసైన్స్‌లో 37, ఇంగ్లీష్ 21, సోషల్ 57, తెలుగు 19, హిందీ 13, ఉర్దూ 3, పీడీలు 6, గ్రేడ్-2 పీజీ హెచ్ఎంలు 38, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలు 60, ఎస్టీటీలు 179, తెలుగు పండిట్లు 9, హిందీ పండిట్లు 10, పీఈటీలు 6, క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్లు 8, డ్రాయింగ్ మాస్టర్లు 5, వొకేషనల్ ఇన్‌స్ట్రక్టర్లు 3 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం జరుగుతున్న బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో జిల్లాలో మరో 350 మంది ఉపాధ్యాయుల ఖాళీలు భర్తీ కానున్నాయి. మరో 150 మంది ఉపాధ్యాయులు డీఎస్సీ ద్వారా భర్తీ అయ్యే అవకాశాలున్నాయి. ప్రభుత్వం మూతబడిన పాఠశాలలను తెరిచేందుకు ప్రయత్నాలు చేస్తుండడంతో మరింత మంది ఉపాధ్యాయులు జిల్లాకు వచ్చే అవకాశముంది.


శిథిలావస్థలో ఉన్న నర్సంపేట మునిసిపాలిటీలోని సర్వాపురం ప్రైమరీ స్కూల్ భవనం

పారిశుధ్య కార్మికులు లేనట్టేనా?

పాఠశాలల్లో ఈ విద్యా సంవత్సరం కూడా పారిశుధ్య పనులు ప్రహసనంగానే మారనున్నాయి. ప్రభుత్వం ఇప్పటి వరకు పాఠశాలల్లో పారిశుధ్య సిబ్బందిని నియమించ లేదు. గత ఏడాది పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందాల కాంట్రిబ్యూషన్‌తో ప్రైవేటు పారిశుధ్య సిబ్బందిని ఏర్పాటు చేసుకొని కాలం వెల్లబుచ్చారు. సంబంధిత మునిసిపాలిటీ, గ్రామ పంచాయతీ శానిటేషన్ సిబ్బందితో తాత్కాలికంగా పాఠశాల ఆవరణను శుభ్రం చేయిస్తున్నారు. అయితే వారు మాత్రం పాఠశాలలోని తరగతి గదులను మాత్రం శుభ్రం చేయమని కరాఖండిగా చెబుతుండటంతో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులే శుభ్రం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

కలవర పెడుతున్న శిథిల భవనాలు..

వరంగల్ జిల్లాలో ఇంకా కొన్ని చోట్ల శిథిల భవనాల్లోనే తరగతులు పునఃప్రారంభం

మిగతా 6వ పేజీలో..

నేటి నుంచి బడులు షురూ..

వేసవి సెలవుల తర్వాత నేటి (బుధవారం)నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం కానుండటంతో విద్యార్థులు సెలవులకు టాటా చెప్పనున్నారు. నెల రోజులుగా ప్రశాంతంగా మూగవోయిన పాఠశాలలు ఇక నుంచి విద్యార్థుల సందడితో అల్లరిగా మారనున్నాయి. జిల్లాలో అన్ని యాజమాన్య పాఠశాలల నుంచి 1,23,663 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఇప్పటికే బడికి రెడీ అవుతున్న చిన్నారులు వారి కొత్త దుస్తులు, బ్యాగులు, పుస్తకాలతో హుషారుగా పాఠశాలలకు పరుగెత్తనున్నారు. నెల రోజులగా ఇంట్లో సందడి చేసిన చిన్నారులు ఇక నుంచి పాఠశాలల్లో అల్లరి చేయనున్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి బుధవారం నాంది కానుంది.

వరంగల్ సీపీగా ఏవీ రంగనాథ్?

- నేడో రేపో ఉత్తర్వులు



వరంగల్ క్రైం, జూన్ 11 : వరంగల్ పోలీస్ కమిషనర్‌గా ఏవీ రంగనాథ్ వస్తున్నట్లు సమాచారం. వరంగల్ రేంజ్ ఇన్‌చార్జ్ ఐజీగా ఉన్న రంగనాథ్‌ను వరంగల్ పోలీస్ కమిషనర్‌గా నియమిస్తూ నేడో రేపో ఉత్తర్వులు జారీ అయ్యే అవకాశం ఉన్నట్టు తెలిసింది. కాగా, వరంగల్ సీపీగా ఉన్న రంగనాథ్ అసెంబ్లీ ఎన్నికల బదిలీల్లో భాగంగా స్థాన చలనం పొందారు. రంగనాథ్‌పై బీజేపీ నేతలు సైతం ఫిర్యాదు చేయ డంతో తప్పని పరిస్థితిలో బదిలీ చేశారనే ప్రచారం ఉంది. రంగనాథ్ స్థానంలో అంబర్ కిషోర్ ఝూను నియమించడం జరిగింది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు ముగిసిన సందర్భంగా ప్రభుత్వం పలువురు ఉన్నతాధికారులను స్థాన చలనం చేస్తుంది. ఇందులో భాగంగా రంగనాథ్ తిరిగి వరంగల్ పోలీస్ కమిషనర్‌గా వస్తున్నారనే ప్రచారం సాగుతోంది. పలువురు రాజకీయ నాయకులు, ఇతర వర్గాలు రంగనాథ్ రాకను స్వాగతిస్తున్నట్లు సమాచారం.


వ్యవసాయ అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

'రైతునేస్తం'తో విప్లవాత్మక మార్పులు

- కలెక్టర్ ప్రావీణ్య

నర్సంపేట, జూన్ 11 : రైతు నేస్తం'తో వ్యవసాయరంగంలో విప్లవాత్మక మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. మంగళవారం నర్సంపేటలో వ్యవసాయ రంగ విస్తరణ, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించడానికి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మలనాగేశ్వరరావు నిర్వహించిన రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులు ఆవిష్కరణలు క్షేత్రస్థాయిలో తీసుకెళ్లడం కోసం ప్రతీ మంగళ, శుక్రవారాల్లో రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నిర్వహించడం జరుగుతుందన్నారు. సాగురంగానికి సాంకేతికతను అనుసంధానం చేస్తూ రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలనే ఉద్దేశంతో రైతునేస్తం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యవసాయశాఖాధికారి ఉషాదయాల్, వ్యవసాయశాకాధికారులు కృష్ణ కుమార్, ఏవోలు, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

నకిలీ విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ప్రావీణ్య హెచ్చరించారు. నర్సంపేట పట్టణంలోని పలు విత్తన దుకాణాలలో జిల్లా వ్యవసాయశాఖాధికారి ఉషాదయాల్, అధికారులతో కలిసి కలెక్టర్ మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. విత్తనాలను విక్రయించే డీలర్ షాపులను, ఆగ్రో సెంటర్లను తనిఖీ చేశారు. విత్తనాలు, యూరియా స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఎవరు నకిలీ విత్తనాలను విక్రయించినా కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు షాపులను సీజ్ చేయడం జరుగుతుందని కలెక్టర్ హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణవేణి, వ్యవసాయశాఖాధికారులు కృష్ణకుమార్, అశోక్ ఇతర అధికారులు శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.


బృందావన్ కాలనీలో పర్యటిస్తున్న కమిషనర్

ముంపునకు గురికాకుండా చర్యలు చేపట్టండి

- కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

మట్టెవాడ, జూన్ 11: వరంగల్ హంటర్‌రోడ్ బొందివాగు సమీపంలో పలు కాలనీలు ముంపునకు గురికాకుండా చర్యలు చేపట్టాలని గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కమిషనర్ అశ్విని తానాజీవాకడే అధికారులను ఆదేశించారు. మంగళవారం హంటర్‌రోడ్‌లోని బృందావన్‌కాలనీలో కమిషనర్, కార్పొరేషన్, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి వరద ముంపునకు గురయ్యే కాలనీలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కొన్నేళ్లుగా బృందావన కాలనీ, సాయినగర్ కాలనీ, ఎన్‌టీఆర్‌కాలనీ, సంతోషిమాత కాలనీ ముంపునకు గురవుతున్నాయని, హంటర్‌రోడ్‌పై రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయని భద్రకాళి బండ్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మర్రి రవీందర్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రతి వర్షాకాలంలో నాలుగు కాలనీల వాసులు ఇబ్బందులు పడుతున్నారని, ముంపునకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఈలు కృష్ణారావు, కాశిబుగ్గ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, ఈఈలు రాజయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నాటకాలు సమాజ చైతన్యానికి తోడ్పాటు

- జాతీయ పద్మశాలీ సంఘం మాజీ అధ్యక్షుడు ఈగ మల్లేశం
- ముగిసిన రాష్ట్ర స్థాయి నాటక పోటీలు


జ్యోతి ప్రజ్వలన చేసి ముగింపు కార్యక్రమాన్ని ప్రారంభించిన ఈగ మల్లేశం

వరంగల్ కల్చరల్, జూన్ 11: యదార్థ జీవిత సత్యాలను నాటకాల ద్వారా ప్రజలకు చేరువచేసి, సమాజ మార్పుకు తోడ్పడుతాయని అఖిల భారత పద్మశాలీ సంఘం మాజీ జాతీయ అధ్యక్షుడు ఈగ మల్లేశం అన్నారు. పోతన విజ్ఞానపీఠంలో జరుగుతున్న నాటక పోటీలు మంగళవారం మూడో రోజు (ముగింపు) వేడుకలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా మల్లేశం మాట్లాడుతూ డిజిటల్ మీడియా ప్రభావంతో నాటకాలకు ఆదరణ తక్కువైందని, అయినా సమాజ చైతన్యం కోసం కళాకారులు కృషిచేయడం అభినందనీయమన్నారు. ముగింపు సందర్భంగా శ్రావణి శిష్య బృందం నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. మా తెలుగు కళాభారతి విశాఖ పట్నంకు చెందిన వారిచే నిశబ్దమా నీ ఖరీదెంత నాటకాన్ని చలసాని కృష్ణప్రసాద్ దర్శకత్వంలో ప్రదర్శించారు. మయూరి ఆర్ట్స్ క్రియేషన్స్ వరంగల్ వారిచే ఉన్నది ఒకటే జీవితం అనే నాటకాన్ని శతపతి శ్యామలరావు నేతృత్వంలో ప్రదర్శించారు. నాటకాలు ముగిసిన అనంతరం కళాకారులకు పారితోషికం, సన్మానం, మెమొంటోలను రంగస్థల కళాకారుల ఐక్య వేదిక సౌజ న్యంతో అందజేశారు.


నీ ఖరీదెంత నాటకంలోని సన్నివేశం

తెలుగు రాష్ట్ర సాంస్కృతిక శాఖ సౌజన్యంలో పోతన విజ్ఞాన పీఠం వేదికగా మూడు రోజులు కొనసాగాయి. ఉత్సవాలను విజయవంతం చేసినందుకు కళాకారుల ఐక్యవేదిక అధ్యక్షుడు కాజీపేట తిరుమలయ్య సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వనం లక్ష్మీకాంతరావు, బోయినపల్లి పురుషోత్తమరావు, వడ్డెపల్లి నర్సింగరావు, నాగపురి సంజయ్ బాబు, కళా రాజేశ్వర్‌రావు, ఏర కోటేశ్వర్‌రావు, కె.కళాధర్, జేఎన్ శర్మ, కుడికాల జనార్దన్, ఎన్ఎస్ఆర్ మూర్తి, ఎం.ప్రభాకర్, జీవీ బాబు, ఆకుతోట లక్ష్మణ్, సాదుల సురేష్, విజయ్‌రాజ్, జూలూరు నాగరాజు, మైక్రో ఆర్టిస్టు మట్టెవాడ అజయ్, చంద్రశేఖర్‌గౌడ్ , కుసుమ సుధాకర్, ఆకుల సదా నందం, పందిళ్ల అశోక్‌కుమార్, శ్రీధర్ స్వామి పాల్గొన్నారు.


డ్రా తీస్తున్న సంధ్యారాణి

'బెస్ట్ అవైలబుల్ స్కూల్స్' సద్వినియోగం చేసుకోవాలి

వరంగల్ కలెక్టరేట్, జూన్ 11: బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత విద్యకు బాటలు వేసుకోవాలని అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి సూచించారు. మంగళవారం వరంగల్ కలెక్టరేట్‌ని కాన్ఫరెన్స్ హాలులో 2024-25 బెస్ట్ అవైలబుల్ స్కూల్ డ్రా కార్యక్రమాన్ని తల్లిదండ్రుల సమక్షంలో నిర్వహించారు.

1వ తరగతిలో 60 సీట్లు, 5వ తరగతిలో 62 సీట్లకు డ్రా పద్ధతిన విద్యార్థులను ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి పెద్దిరెడ్డి భాగ్యలక్ష్మీ పాల్గొన్నారు.

PUBLIC NOTICE

It is to inform all the general in public that, my client **Akula Madhavi**, W/o. **KranKumar**, R/o.H.No.29-1-92/A Manthrapuri colony, Erragattugutta, KITS X-Road, Bheemaram, Hasanparthy Mandal of Hanamkonda District, is intending to purchase

SCHEDULE OF PROPERTY

Agriculture land to an extent of Ac.1-00 gts out of the land to an extent of Ac 0-12 gts in sy.No.626/B1/1, Ac.0-21 gts in sy.No.627/B/1/2, Ac.0-17 gts in sy.No.628/E/3/2/1 total Ac.1-10 gts,situated at Nidigonda village, Raghunathpally Mandal of Jangaon district boundaries as follows

EAST : Remaining Agriculture land of others
WEST : Agriculture land of kapa
NORTH : 200 fts NH Road towards Hanmakonda to Hyderabad
SOUTH :Agriculture land of Vatala Erra Narsaiah

from its owner Neelam Sammiah, S/o.Neelam Yakaiah, R/o.H.No.16-4-333 Rudramamba Nagar, Fort, Road, Warangal and entered into an agreement of sale dt : 18-04-2024, in this regard my client is causing this publication calling objection from general public with regard to the sale transaction, if any person is having any claim, shall inform the same within seven days from the date of this publication, otherwise my client shall proceed further transaction by treating as no objection from anybody.

Hence this publication

MAREDU SRINATH ADVOCATE.
Warangal
Cell:9291414964

వీధి కుక్కల వృద్ధికి చెక్

- ఇప్పటికే 25 వేల శునకాలకు సంతతి నియంత్రణ ఆపరేషన్లు
- చింతగట్టు ఏబీసీ సెంటర్ ద్వారా నిర్వహణ
- మరో కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్
- పనులు చేసేందుకు ముందుకు రాని కాంట్రాక్టర్లు
- బల్దియా పరిధిలో 35,625 కుక్కల సంచారం


చింతగట్టులోని ఏబీసీ సెంటర్

వరంగల్ కార్పొరేషన్, జూన్ 11: నగరంలో వీధి కుక్కల బెడద రోజురోజుకూ ఎక్కువవుతోంది. గ్రేటర్ వరంగల్‌లోని 66 డివిజన్ల పరిధిలోని వేలాది సంఖ్యలో సంచరిస్తున్న క్రమంలో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. వీధి కుక్కల దాడులకు ఎంతో మంది గాయాలపాలవుతున్నారు. ఈ క్రమంలో కుక్కలు, వాటి సంతతిని నియంత్రించడంలో బల్దియా అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని నగర ప్రజలు ఆరోపిస్తున్నారు. అయితే కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్న అధికారులు.. వాటికి సంతాన నియంత్రణ ఆపరేషన్లు చేయిస్తున్నామంటున్నారు. గ్రేటర్ వరంగల్ పరిధిలో ట్రినిటీ స్వచ్ఛంద సంస్థ చెప్పిన లెక్కల ప్రకారం 35,625వీధి కుక్కలు సంచరిస్తున్నాయి. వాటిని పట్టుకుని సంతతి నియంత్ర ఆపరేషన్లు చేస్తున్నా రెండేళ్లలో కొన్ని మరణించగా, మరో పది వేలు వృద్ధి చెందినట్టు తెలిసింది. ఇప్పటి వరకు ఎనిమిదేళ్లలో సుమారు 25వేల వీధి కుక్కలకు సంతాన నియంత్రణ ఆపరేషన్లు చేసినట్టు అధికారులు వెల్లడించారు.

ఏబీసీ సెంటర్ సేవలు

కేంద్ర ప్రభుత్వ పథకం కింద రాష్ట్రంలో హైదరాబాద్, వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ల (ఏబీసీ)ను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో వరంగల్ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో హసన్‌పర్తి మండలం చింతగట్టులో 2018లో ఏర్పాటు చేశారు. ఈ సెంటర్‌లో 'స్వతంత్ర' యానిమల్ సేఫ్టీ అనే స్వచ్ఛంద సంస్థ కాంట్రాక్ట్ పద్ధతిలో సేవలందిస్తుండగా ఎస్‌పీసీఏ డాగ్ యాక్ట్ సర్టిఫికెట్ పొందిన ఎన్‌జీవోలు మాత్రమే పని చేస్తాయని, అన్ని రకాల శిక్షణ పొందిన వారు మాత్రమే యానిమల్ సేఫ్టీ విభాగంలో పని చేసేందుకు అర్హులని డాక్టర్లు తెలిపారు. బల్దియా నిధుల నుంచి కుక్కల్లో సంతాన నియంత్రణ ఆపరేషన్లు, వాక్సిన్, వాటికి ఆహారం కోసం ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయిస్తారు. ఓ ప్రాంతంలో ఒక కుక్కను పట్టుకున్నది మొదలు దానికి ఆపరేషన్ చేసి తిరిగి యథాస్థానంలో వదిలేసే వర కు అయ్యే ఖర్చుగా రూ.800వరకు ఇస్తున్నారు. ఏబీ సీ సెంటర్‌లో ప్రతీ రోజు మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు ఆడ, మగ శునకాలకు సంతాన ఉత్ప త్తి నియంత్రణ ఆపరేషన్లు చేస్తుంటారు. నెలలో కనీ సం 400 నుంచి 500 శునకాలకు ఈ ఆపరేషన్లు చే స్తారు. అయితే కుక్కలకు ఈ ఆపరేషన్లు చేయడం వల్ల వాటిలో హార్మోన్ల ఉత్పత్తి తగ్గి సంతాన ఉత్పత్తి ఉండదని, మనుషులను కరిచే స్వభావం తగ్గుతుందని పశువైద్యులు చెబుతున్నారు.


వీధి కుక్కకు సంతతి నియంత్రణ ఆపరేషన్ చేస్తున్న డాక్టర్ (ఫైల్)

రెండో సెంటర్ ఏర్పాటుపై నిర్లక్ష్యం

రెండేళ్ల కిందట బల్దియాకు మరో ఏబీసీ సెంటర్ మంజూరైంది. అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల అలసత్వం వల్ల పనులు ఇంకా ప్రారంభం కాలేదన్న విమర్శలున్నాయి. ప్రభుత్వం నుంచి నిధులు విడుదలైనా, కార్పొరేషన్‌లో కోట్ల నిధులున్నా రెండో సెంటర్ పనులు ఎందుకు ప్రారంభం కావడం లేదనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. బల్దియా టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్ అధికారులకు అందాల్సిన పర్సంటేజీల లెక్క తేలకపోవడం వల్లే టెండర్లు పిలవలేదన్న ప్రచారం జరుగుతోంది.

కుక్కలకు ఇబ్బంది కలిగించవద్దు..

- డాక్టర్ కె.గోపాల్‌రావు, జీడబ్ల్యూఎంసీ విశ్రాంత వెటర్నరీ అధికారి

వీధి కుక్కలంటే అందరూ చులకనగా చూస్తారు. అవి ఎంతో విశ్వాసంగా ఉంటాయన్నది అందరికీ తెలిసిందే. వాటి స్వేచ్ఛా జీవితానికి ఇబ్బంది కలిగించొద్దు. వాటిపై ఒత్తిడి కలిగించినా, తల్లి కుక్క వద్దకు వెళ్లి బెదిరించినా, ఆడ, మగ శునకాల కలయిక సమయంలో ఇబ్బందికి గురి చేసినా దాడి చేసి కరిచే అవకాశాలుంటాయి. నగరంలో ఒక సంతాన నియంత్రణ ఆపరేషన్లు చేసే సెంటర్ ఒకటే ఉంది. మరో సెంటర్ ఏర్పాటు చేస్తే చాలా వరకు కుక్కల ఎదుగుదలను అరికట్టే అవకాశం ఉంటుంది.

సమాచారం ఇవ్వండి ఇలా..

బల్దియా పరిధిలో వీధికుక్కల నుంచి ఇబ్బందులు ఎదురైనా, వాటి దాడిలో గాయపడిన వారైనా

మిగతా 6వ పేజీలో..



విత్తన కుంభకోణంపై విజిలెన్స్ విచారణ చేపట్టాలి

స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకోవాలి

సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా



సమావేశంలో మాట్లాడుతున్న కొత్తపల్లి రవి

తొర్రూరు(మహబూబాబాద్ జిల్లా), జూన్ 11: రైతాంగానికి అవసర మయ్యే జీలుగ, పచ్చిరొట్ట తదితర విత్తనాల కుంభకోణంలో విజిలెన్స్ విచారణ చేపట్టాలని స్థానిక ఎమ్మెల్యే జోక్యం చేసుకుని నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. మంగళవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలో ఆయన మాట్లాడారు. 1660 బస్తాలు బోగస్ పేర్లతో ఇతర రాష్ట్రాలకు తొర్రూరు వ్యవసాయాధికారి అమ్ముకుంటే విచారణ చేపట్టిన అధికారి పూర్తి స్థాయిలో విచారణ చేయకుండా తప్పుడు నివేదిక అందించారన్నారు. సుమారు రూ.20లక్షల మేర కుంభకోణం జరిగినా ప్రజా ప్రతినిధులు, వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం సరికాదన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని స్థానిక ఎమ్మెల్యే యశస్విని‌రెడ్డి జోక్యం చేసుకుని సమగ్ర జ్యుడీషియల్ విచారణ జరిపించాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి రాకుండా ఇతర అధికారులను పంపించి మొక్కుబడి విచారణ వల్లే జరిగిన అవినీతి అక్రమ కుంభకోణం బయటికి రావడం లేదన్నారు. క్షేత్ర స్థాయిలో ఆగ్రోస్ నిర్వాహకులు అక్రమాలకు పాల్పడుతుంటే వ్యవసాయాధికారులు కన్నెత్తి చూడకపోవడం సరికాదన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిందని, ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని వాటిపై దృష్టి సారించాలన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు వీరన్న, వెంకటేశ్వర్లు, పాపారావు, అనిల్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను సజావుగా నిర్వహించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 11 : ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ సజావుగా నిర్వహించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎం. రవీందర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండలోని డీఈవో కార్యాలయంలో డీఈవో అబ్దుల్ హైని మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఉపాధ్యాయులెవరూ నష్టపోకుండా పారదర్శకంగా సీనియారిటీ జాబితాలను రూపొందించి ఉపాధ్యాయుల అభ్యంతరాలను స్వీకరించాలని కోరారు. అభ్యంతరాలను సానుకూల దృక్పథంతో పరిష్కరించి పారదర్శక సీనియారిటీ జాబితాలను డీఈవో వెబ్‌సైట్‌లో ప్రదర్శించాలన్నారు. బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ సజావుగా కొనసాగేందుకు పీఆర్టీయూ అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి పలీత శ్రీహరి, అసోసియేట్ అధ్యక్షుడు రొండ్ల భానుప్రసాద్, నాయకులు డి. మాలకొండారెడ్డి, జి. రాజు పాల్గొన్నారు.



డీఈవో అబ్దుల్ హైకి వినతి పత్రం అందజేస్తున్న పీఆర్టీయూ నాయకులు

ఉద్యోగం ఇప్పిస్తానని రూ.20లక్షలకు టోకరా

ఇద్దరిపై కేసు నమోదు

గార్ల, జూన్ 11: మహబూబాబాద్ జిల్లా గార్ల మండల పరిధిలోని వీక్లీ తండాకు చెందిన బోడ సంజిల్‌కు ఉద్యోగం ఇప్పిస్తానని హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు రూ.20 లక్షలు తీసుకున్నారని, దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై జీనత్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. హైదరాబాద్‌కు చెందిన దాసరి రమ్య-వంశీ దంపతులు ఇంట్లో సంజిల్ అక్క భూక్యా ఉష ఏడాది కాలం నుంచి పని చేస్తోంది. ఈ క్రమంలో తమ తమ్ముడు సంజిల్‌కు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించాలని రమ్య-వంశీలను ఉష ప్రాధేయపడింది. దీంతో కొంత డబ్బు ఇస్తే ఉద్యోగం ఇప్పిస్తాని చెప్పి దంపతులు నమ్మబలికారు. రూ.20 లక్షలు ఒప్పందం కుదుర్చుకున్నారు. 2023 డిసెంబర్ నుంచి నేటి వరకు విడతల వారీగా ఫోన్‌పే, అకౌంట్ ద్వారా డబ్బులు చెల్లించారు. అయినప్పటికి ఉద్యోగం చూపించకపోవడంతోరమ్య-వంశీపై సంజిల్ గార్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



వరంగల్ హెడ్‌పోస్టాఫీసు వద్ద ఉత్తరాలను పోస్టుబాక్సులో వేస్తున్న పరికిపండ్ల అశోక్, తదితరులు

సాధారణ బోగీల కోసం సమరం

- మానుకోట నుంచి కోటి ఉత్తరాల పోరుకు శ్రీకారం
- తెలుగు రాష్ట్రాల్లో ఊపందుకున్న నినాదం
- రైళ్లలో జనరల్ బోగీల సంఖ్య పెంచాలనేదే అందరి డిమాండ్
- ప్రధానికి మోదీకి చేరడమే లక్ష్యంగా ప్రారంభించిన మహబూబాబాద్ వాసి

మహబూబాబాద్ టౌన్, జూన్ 11 : ప్రతీ రైలులో రెండు జనరల్ బోగీలు మాత్రమే ఉంటాయి.. అవి సాధారణ ప్రయాణికులకు సరిపోక ఇబ్బందులు పడుతున్నారు. రైలు ప్రవేశ ద్వారాల్లో వేలాడుతూ.. అవస్థలు పడుతూ ప్రయాణిస్తుంటారు. దేశంలో ప్రతీరోజు రైళ్లలో దాదాపు 30లక్షల మంది ప్రయాణిస్తున్నారని ఓ అంచనా. వారి ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రతీ రైలులో ఐదు సాధారణ బోగీలను ఏర్పాటు చేయాలని.. అప్పుడే ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందని, దేశ వ్యాప్తంగా రైళ్లలో సాధారణ ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రధాని మోదీ దృష్టికి తీసుకు పోవాలన్న లక్ష్యంతో మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన సామాజికవేత్త డాక్టర్ పరికిపండ్ల అశోక్ మార్చి 8న ప్రధానికి కోటి ఉత్తరాల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రైలులో ఐదు సాధారణ బోగీల సాధన సమితిని ఏర్పాటు చేసి శ్రీకారం చుట్టిన ఈ ఉద్యమం మూడునెలల కాలంలోనే తెలుగురాష్ట్రాలకు పాకింది. మూడునెలల్లో ఆయన తెలంగాణలో 29 జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఉద్యమాన్ని విస్తృత పర్చారు. ఇక ఈ ఉద్యమం గురించి వివిధ మాధ్యమాల ద్వారా తెలుసుకున్న వివిధ రాష్ట్రాల ప్రజలు కూడా స్వచ్ఛందంగా మద్దతు పలుకుతూ వారు సైతం ప్రధానికి ఉత్తరాలు రాస్తున్నారు. గుజరాత్ రాష్ట్రంలోని సూరత్‌కు జీవనోపాధికోసం వెళ్లిన తెలుగు ప్రజలు కూడా కోటి ఉత్తరాల కార్యక్రమంలో భాగస్వాములవుతున్నారు. ఇలా ఇప్పటి వరకు దేశ వ్యాప్తంగా 8 లక్షల ఉత్తరాలను ప్రధానికి రాసినట్లు డాక్టర్ పరికిపండ్ల అశోక్ తెలిపారు.

ఉద్యమానికి బీజం ఇలా..

మహబూబాబాద్ నుంచి వరంగల్ వెళ్లేందుకు 2024 మార్చి 8న మానుకోట పట్టణానికి చెందిన రైళ్లలో ఐదు సాధారణ బోగీల సాధన సమితి జాతీయ కన్వీనర్ పరికిపండ్ల అశోక్ మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌లో వేచి ఉన్నారు. కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రాగా ఆ రైలుకు ముందు భాగంలో ఇంజన్ వెనుక ఒక జనరల్ బోగి, వెనుక భాగంలో మరో జనరల్‌బోగీ ఉంది. ఈ క్రమంలో మహబూబాబాద్ జిల్లాకు చెందిన ఓ గర్భిణి చిన్నపాపతో కోణార్క్ రైలు ఎక్కేందుకు ప్రయత్నించి, కింద పడిపోయింది. చంకలో ఉన్న పాప తలకు దెబ్బతగిలింది. వెంటనే 108 ద్వారా మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. ఆరు రోజుల తర్వాత అభంశుభం తెలియని ఆ పాప చనిపోయింది. పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆ గర్భిణికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.

కొద్ది రోజుల తర్వాత గర్భంలో ఉన్నపిండం కూడా చనిపోయిందని తెలిసింది. దీం తో చలించి పోయిన పరికిపండ్ల అశోక్ ఈ తప్పు ఎవరిదీ? శిక్ష ఎవరికి? అని ఆలోచించి, సాధారణ ప్రయాణికుల బాధలను ప్రధాని మోదీ దృష్టికి తీసుకువెళ్లి సరిష్కరించాలని కోటి ఉత్తరాల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.



మహబూబాబాద్ రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కడానికి సిద్ధంగా ఉన్న సాధారణ ప్రయాణికులు (ఫైల్)

20 ఏళ్ల నుంచి రెండు సాధారణ బోగీలే..

దేశ వ్యాప్తంగా రోజురోజుకు జనాబా వృద్ధి చెంది రైలు ప్రయాణికులు పెరుగుతున్నప్పటికి రైళ్లల్లో మాత్రం జనరల్ బోగీల సంఖ్య మారడం లేదు. దాదాపు రెండు దశాబ్దాల కిందట నుంచి ఇప్పటికి ప్రతీ రైలులో రెండు సాధారణ బోగీలు మాత్రమే ఉంటున్నాయి. నిత్యం వ్యాపార, ఉద్యోగ పనుల నిమిత్తం నిత్యం ప్రయాణించే వారి సం ఖ్య విపరీతంగా పెరుగుతూ వస్తోంది. రెండు జనరల్ బోగీలు మాత్రమే ఉండడంతో సాధారణ ప్రయాణికులు రైలు ఎక్కాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. ఏవో ఇబ్బందులు పడి రైలు ఎక్కినప్పటికి గమ్య స్థానం చేరేంత వరకు నిలబడి ప్రయాణించాల్సిన పరిస్థితి నెలకొంటుంది. దీంతో చిన్నారులు, వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రపంచంలో అతి పెద్ద రవాణావ్యవస్థగా ఉన్న భారత రైల్వేశాఖ ఈ సమస్యను తీర్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రయాణికులు కోరుతున్నారు.

ఎల్లలు దాటిన కోటి ఉత్తరాల కార్యక్రమం..

ప్రతీ రైలులో ఐదు సాధారణ బోగీలు ఏర్పాటు చేయాలని మానుకోట నుంచి ఆరం భమైన ప్రధానికి కోటి ఉత్తరాల కార్యక్రమం ఒక్క జిల్లానే కాదు..! ఒక్క రాష్ట్రం కాదు.. ఎల్లలు దాటి దేశవ్యాప్తమైంది. సాధారణ బోగీల సాధన సమితి జాతీయ కన్వీనర్ డాక్టర్ పరికిపండ్ల అశోక్ తెలంగాణ రాష్ట్రంలోని 29 జిల్లాలు, ఆంధ్రప్రదేశ్‌లోని 18 జిల్లాలు గుజరాత్ రాష్ట్రం సూరత్‌లో, పాండిచ్చేరి సమీపంలోని యానంలో కూడా స్వయంగా కోటి ఉత్తరాల ఉద్యమంపై అవగాహన కల్పించారు. భారత దేశంలో 140 కోట్లకు చేరువైన జనాభాలో సుమారు ప్రతీరోజు 30 లక్షల మంది ప్రయాణికులు రైళ్ల ద్వారా ప్రయాణి స్తున్నారని, సాధారణ ప్రయాణీకుల బాధలను గుర్తించి అందరూ ప్రధానికి ఉత్తరం రాయాలని కరపత్రాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. అన్నివర్గాల ప్రజల మద్దతు లభించడంతో ఇప్పటికే దాదాపుగా 8 లక్షల వరకు ప్రధానికి ఉత్తరాలను పంపి ఉండవచ్చని చెబుతున్నారు. ప్రతీ రైలులో ఐదు సాధారణ బోగీలను ఏర్పాటు చేసి ప్రయాణికుల కష్టాలను తీర్చాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రతీ రైలులో ఐదు సాధారణ బోగీలను ఏర్పాటు చేయాలి

డాక్టర్ పరికిపండ్ల అశోక్, రైలులో ఐదు సాధారణ బోగీల సాధన సమితి జాతీయ కన్వీనర్, మానుకోట



ప్రయాణికుల కష్టాలను దృష్టిలో పెట్టుకుని ప్రతీ రైలులో ఐదు సాధారణ బోగీలను ఏర్పాటు చేయాలి. రైళ్లలో జనరల్ బోగీలు ఎక్కువగా లేకపోవడంతో నిత్యం ప్రయాణించే వారు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అంతే కాకుండా రైలుఎక్కే సమయంలో ప్రయాణికులు ఎక్కువగా ఉండడంతో, కొందరు ఎక్కలేక పోతున్నారు. మరి కొంతమంది రైలు ఎక్కే సమయంలో జారి కిందపడి ప్రమాదాలకు గురవుతున్నారు. ఐదు సాధారణ బోగీలను ఏర్పాటు చేసి ప్రయాణికుల సమస్యను పరిష్కరించాలి.



ప్చ్.. చిప్స్ లేవే..!

చెట్టుపైనున్న ఓ ఉడత.. ఎవరో తినిపడేసిన చిప్స్‌ప్యాకెట్‌ను చూసింది. అందులో ఏమైనా తినడానికి దొరుకుతాయేమోనని ఆశపడింది. ఎంతో ఆత్రుతగా.. ఆశగా చెట్టుపై నుంచి దిగి వచ్చింది. ఆ ఖాళీ ప్యాకెట్‌ను అటు.. ఇటు.. కిందికి.. పైకి తిప్పి చూసింది. కానీ అందులో ఏమీ దొరక్కపోవడంతో.. చివరకు ప్యాకెట్‌కు అంటుకుని ఉన్న కాస్తంత చిప్స్ పొడిని ఆస్వాదించి వెళ్లిపోయింది. ఈ దృశ్యాలు హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో మంగళవారం కనిపించాయి.

ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్

ముఖ్యమంత్రిని కలిసిన టెస్కాబ్ చైర్మన్ మార్నేని



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు

హనుమకొండ సిటీ, జూన్ 11 : తెలంగాణ స్టేట్ కో-ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్‌గా నియమి తులైన మార్నేని రవీందర్‌రావు హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలను మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం ముఖ్యమంత్రి రేవం త్‌రెడ్డిని కలిసిన తరువాత ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మంత్రులు సీతక్క, కొండా సురేఖతో పాటు ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాగరాజు తదితర కాంగ్రెస్ ముఖ్య నేతల ను కలిశారు. చైర్మన్‌గా నియమితులైన రవీందర్‌రావుకు అభినందనలు తెలియచేశారు. టెస్కాబ్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన రవీందర్‌రావు సాయంత్రం హనుమకొండలోని డీసీసీ బ్యాంక్‌కు చేరుకున్నారు. బ్యాంకు సిబ్బంది, సహకార శాఖ ఉద్యోగులు, సీఈవోలు తదితరులు ఆయనకు భారీ పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం బ్యాంకులో జరిగిన కార్యక్రమంలో మార్నేనిని సన్మానించారు. టెస్కాబ్ చైర్మన్‌గా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని ఈ సందర్భంగా రవీందర్‌రావు పేర్కొన్నారు.

మార్కెట్‌లో వ్యాపారుల ఆందోళన

- డబ్బులు డిమాండ్ చేస్తున్నారంటున్న ఆగ్రహం
- నిబంధనల మేరకే నడుచుకున్నామన్న అధికారులు



మార్కెట్ కార్యాలయంలో ఆందోళన నిర్వహిస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, వ్యాపారులు

వరంగల్ వ్యవసాయం, జూన్ 11: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ ప్రధాన కార్యాలయంలో మంగళవారం చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, వ్యాపారులు ఆందోళనకు దిగారు. పర్మిట్ బుక్కులు ఇవ్వకుండా, ఏదో ఒకసాకుతో డబ్బులు గుంజేలా వ్యాపారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ అధికారులతో చాంబర్ ప్రతినిధులు వాగ్వాదానికి దిగారు. మంగళవారం ఉదయం కరానీ ఖరీదుదారుడికి సంబంధించిన గుమస్తా మార్కెట్ కార్యాలయంలోని సూపర్‌వైజర్ మురళీ వద్దకు వెళ్లి పర్మిట్ బుక్కులను ఇవ్వాలని కోరాడు. సూపర్‌వైజర్ 2024 కొత్త నామ్స్ ప్రకారం ఓపెనింగ్, క్లోజింగ్, బ్యాలెన్స్ 1 నుంచి 10 ప్రొఫార్మా కావాలని, అది ఇస్తే పర్మిట్ బుక్కులు ఇస్తానని చెప్పడంతో సదరు గుమస్తా అక్కడ జరిగిన విషయాన్ని యజమానికి వివరించాడు. కరానీ యజమానితోపాటు చాంబర్ ప్రతినిధులు, వ్యాపారులు మార్కెట్ కార్యాలయానికి చేరుకుని సూపర్‌వైజర్‌తో పాటు గ్రేడ్ 2 కార్యదర్శి రాముతో వాగ్వాదానికి దిగారు. పర్మిట్ బుక్కులు ఎందుకు ఇవ్వరని, వ్యాపారుల నుంచి డబ్బులు గుంజాలని చూస్తున్నారంటూ గొడవకు దిగారు. కొత్తగా వచ్చిన నిబంధనల మేరకే ఓపెనింగ్, క్లోజింగ్, బ్యాలెన్స్ షీట్ అడిగామని, డబ్బులు అడగలేదని గ్రేడ్ 2 కార్యదర్శి చెప్పే ప్రయత్నం చేసేనా వారు పట్టించుకోలేదు. చాంబర్ ప్రతినిధులు, వ్యాపారులు మినీ చాంబర్ కార్యాలయంలో సమావేశమయ్యారు.

జమ్మికుట మార్కెట్‌కు వెళ్లిన మార్కెట్ కార్యదర్శి

ఏనుమాముల మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి గుగులోతు రెడ్డి మంగళవారం జమ్మికుంట మార్కెట్ వెళ్లారు. మార్కెట్లో గొడవ జరిగిన సమయంలో మార్కెట్లో లేరు. దీంతో చిన్న విషయం కాస్తా పెద్దగా తయారైంది. జమ్మికుంట మార్కెట్ కార్యదర్శిగా ఉన్న నేపథ్యంలో అక్కడ కూడా కార్యకలాపాలు ఎలా నడుస్తున్నాయో చూసేందుకు వెళ్లారు. ఏనుమాముల మార్కెట్లో కార్యదర్శి అందుబాటులో లేకపోవడంతో అధికారులు మార్కెట్లో జరిగిన విషయాన్ని మార్కెట్ కార్యదర్శికి ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. దీంతో హుటాహుటిన మార్కెట్ కార్యదర్శి ఏనుమాముల మార్కెట్‌కు చేరుకున్నారు.

మార్కెట్లో చాంబర్ ప్రతినిదులు ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకున్న ఏనుమా ముల మార్కెట్ పర్సన్ ఇన్‌చార్జి, మార్కెటింగ్‌శాఖ వరంగల్ రీజియన్ జాయింట్ డైరెక్టర్ మల్లేశం, డిప్యూటీ డైరెక్టర్ అజ్మీర రాజు ఏనుమాముల మార్కెట్‌కు చేరుకుని అధికారులతో సమావేశమై పరిస్థితిని సమీక్షించారు.

చాంబర్ ప్రతినిధులతో అధికారుల సమావేశం

మార్కెట్ పర్సన్ ఇన్‌చార్జి మల్లేశం, డీడీ అజ్మీరాజు, మార్కెట్ కార్యదర్శి గుగులోతు రెడ్డి చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు బొమ్మినేని రవిందర్‌రెడ్డి, మడూరి వేదప్రకాష్, అల్లె సంపత్, అలాగే కాటన్ సెక్షన్ అధ్యక్షుడు చింతపల్లి వీరారావు, కరాని రాజు తదితర వ్యాపారులతో సమావేశమయ్యారు. సమస్య సద్దుమనిగేందుకు అధికారులు కృషి చేశారు. 2024 నిబంధనల మేరకు ఓపెనింగ్, క్లోజింగ్, బ్యాలెన్స్ ఫాం 1 టు10 ప్రొఫార్మా ప్రతీ నెల 10వ తేదీలోపు ఇవ్వాల్సి ఉండగా దానిని 20వ తారీకు వరకు ఇచ్చేందుకు చాంబర్ ప్రతినిధులు గడువు కోరారు. పర్మిట్ బుక్కులు ఇవ్వాలంటే తప్పకుండా ప్రతీనెల పీఆర్ ఇవ్వాలని, మార్కెట్ ఫీజు 10 తారీకు లోపు చెల్లించాలని అధికారులు షరతు పెట్టారు. దానికి చాంబర్ ప్రతినిధులు కూడా ఒప్పుకోవడంతో సమస్య సద్దుమనిగింది.

నిరంతరాయ విద్యుత్ సరఫరాకు కృషి

- అధిక లోడ్, అంతరాయాల నివారణకు ప్రత్యేక చర్యలు
- త్వరలో 35 కొత్త సబ్‌స్టేషన్ల ఏర్పాటు
- 'ఆంధ్రజ్యోతి'తో టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటీ వరుణ్‌రెడ్డి



హనుమకొండ సిటీ, జూన్ 11 : ఎన్పీడీసీఎల్ పరిధిలో ఎలాంటి అంతరాయాలు లేకుండా నిరంతరం విద్యుత్‌ను అందించేందుకు శక్తి వంచనలేకుండా కృషిచేస్తున్నామని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మెరుగైన విద్యుత్‌ను అందించేందుకు ఎన్పీడీసీఎల్ పరిధిలో తీసుకోబోతున్న చర్యల గురించి ఆయన 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. మానవ ప్రమేయం లేకుండా సాంకేతికను జోడించి అంతరాయాలకు సంబంధించిన సమస్యలను కార్పొరేట్ ఆఫీస్ నుంచి గుర్తించి సత్వర చర్యలు చేపట్టేలా ఆర్‌టీడీఏస్, ఎస్‌ఏడిఏను ప్రతీ సబ్‌సబ్‌స్టేషన్‌లో అమర్చబోతున్నామన్నారు. 33/11 కేవీ సబ్‌స్టేషన్లలో అంతరాయాలు ఏర్పడినప్పుడు ప్రత్యామ్నయంగా విద్యుత్ సరఫరా చేసేందుకు 800కిలోమీటర్ల మేర లైన్ ఏర్పాటుకు టెండర్లను ఆహ్వానించామని, మరో 300కిల్లోమీటర్లకు త్వరలోనే టెండర్లకు ఆహ్వానిస్తామన్నారు. ఎన్పీడీసీఎల్ పరిధిలోని ఆసిఫాబాద్, ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్, ఖమ్మం జిల్లాల్లో ఉన్న లెంతీలైన్‌ల మధ్య అంతరాయాలు తగ్గించేందుకు ప్రతీ 5 కిలోమీటర్లకు ఒక పాల్ట్ ప్యాసెజ్ ఇండికేటర్స్ (ఎఫ్‌పీఐ) ఏర్పాటు చేయబోతున్నట్టు తెలిపారు. విద్యుత్ అంతరాయాలకు, ప్రమాదాలకు కారణమవుతున్న లూజ్ లైన్‌లను చాలా వరకు సవరించడం జరిగిందని, ఇంకా అక్కడక్కడ పెండింగ్‌లో ఉన్న లూజ్ వైర్లను సవరించే ప్రక్రియ కొనసాగతుందన్నారు. అధికలోడును తగ్గించేందుకు ఎన్పీడీసీఎల్ పరిధిలో త్వరలోనే 35 సబ్‌స్టేషన్స్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. అదే విధంగా ఎన్పీడీసీఎల్ పరిధిలో 2156 సింగిల్ ఫెజ్ లైన్‌లను త్రీ ఫెజ్ లైన్‌లుగా మార్చాలని ప్రతిపాదనలు సిద్ధం చేయగా ఇప్పటి వరకు 1995 లైన్‌లను త్రీ ఫెజ్ లైన్‌లుగా మార్చడం జరిగిందన్నారు. కాగా, ఉమ్మడి వరంగల్‌లో 402 సింగిల్ ఫెజ్ లైన్‌లను త్రీ ఫెజ్‌లైన్‌గా మార్చడం జరిగిందన్నారు. మిగితా వాటిని మార్చేందుకు వేగంగా పనులు జరుగుతున్నట్లు వెల్లడించారు. వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిరంతర విద్యుత్‌ను అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

'విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాం అందించాలి'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, జూన్ 11 : జిల్లా వ్యాప్తంగా ఈ నెల 12న పాఠశాలలు పునఃప్రారంభమైన తొలి నాడే విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు అందించాలని జిల్లా విద్యాశాఖాధికారి రామారావు అన్నారు. మహబూబాబాద్ మునిసిపాలిటీ పరిధిలోని శనిగపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా సందర్శించి పాఠశాలకు చేరిన పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, నోట్ పుస్తకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. ఆహ్లాదకరమైన వాతావరణంలో పాఠశాలలను పునఃప్రారంబించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నామని, ఎస్సెస్సీ ఫలితాల్లో కూడా ఉత్తమ మార్కులు సాధించిన విషయాన్ని తల్లిదండ్రుల దృష్టికి తీసుకువెళ్లి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని అవగాహన కల్పించాలని సూచించారు. పాఠశాలల ప్రారంభానికి జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, స్థానిక శాసనసభ్యులు, ఎంపీ, ఎమ్మెల్సీలు, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారని తెలిపారు. డీఈవో వెంట సెక్టోరియల్ అధికారి సుధాకర్, హెచ్‌ఎం శ్రీధర్, ఉపాధ్యాయులు రంజాన్ అలీ, వీరస్వామి ఉన్నారు.

విద్యుత్ బిల్లులను ఆన్‌లైన్‌లో చెల్లించాలి

హనుమకొండ టౌన్, జూన్ 11 : వినియోగదారులు నెలవారీ విద్యుత్ బిల్లులను ఆన్‌లైన్‌లో చెల్లించి గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడే పరిస్థితి నుంచి బయటపడాలని వరంగల్ ఎస్‌ఈ మధుసూదన్‌రావు సూచించారు. సాంకేతికత అభివృద్ధి చెందుతున్న తరుణంలో ఆన్‌లైన్ చెల్లింపులతో విద్యుత్ బిల్లు చెల్లింపును సులభతరం చేసుకోవాలని పిలుపునిచ్చారు. గత నెలలో 71,367 గృహ వినియోగదారులు ఆన్‌లైన్ ద్వారా రూ.10.97 కోట్లు చెల్లించడం జరిగిందన్నారు. వినియోగదారులు టీజీ ఎస్పీడీసీఎల్ మొబైల్ యాప్, డిస్కం వెబ్‌సైట్, గూగుల్ పే, ఫోన్ పే, పేటీయం ద్వారా బిల్లుపై ఉన్న యుఎస్సీ నెంబర్ నమోదు చేసి ఆన్‌లైన్‌లో బిల్లులు చెల్లించవచ్చన్నారు. ప్రస్తుతం కొత్తగా బిల్లుపై క్యూఆర్‌కోడ్ వస్తుందని, దాని ద్వారా సైతం బిల్లు చెల్లించవచ్చన్నారు. పైలట్ ప్రాజెక్టులో భాగంగా వరంగల్ సర్కిల్‌లోని మట్టెవాడ ఈఆర్‌వో పరిధిలో ప్రారంభించడం జరిగిందని, త్వరలోనే అన్ని ఈఆర్‌వోలలో ప్రారంభించడం జరుగుతుందన్నారు.

కష్టాల వెంబడి..

3వ పేజీ తరువాయి

కానున్నాయి. నర్సంపేట మునిసిపాలిటీ పరిధిలోని సర్వాపురం ప్రైమరీ పాఠశాలలో 40మంది విద్యార్థులున్నారు. పాఠశాల భవనం మాత్రం శిథిలావస్థలో ఉంది. పదేళ్లుగాపరిస్థితి మారడం లేదు. మన ఊరు, బస్తీ, మన బడి తొలి విడతలో పాఠశాలను గుర్తించకపోవడం విద్యార్థుల తల్లిదండ్రులు అస హనం వ్యక్తం చేస్తున్నారు. చినుకు పడితే పాఠశాలకు సెలవు ప్రకటించే దుస్థితి నెలకొంది.

మొదటి రోజే యూనిఫామ్, పుస్తకాలు ..


పాఠశాలల పునఃప్రారంభం తొలిరోజే విద్యార్థులకు యూనిఫామ్‌లతోపాటు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు అందజేయనున్నారు. మంత్రి కొండా సురేఖ బుధవారం మధ్యాహ్నం ఖిలావరంగల్‌లోని ఆరెల్లి బుచ్చయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు అందజేయనున్నారు. వివిధ ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఒక్కో జత చొప్పున 38,020 యూనిఫామ్స్ అందజేయనున్నారు. జిల్లాకు ఇప్పటికే 100 శాతం పుస్తకాలు వచ్చాయి. అందులో 86శాతం పుస్తకాలు పాఠశాలల్లో పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి.

కొనసాగుతున్న బడిబాట...

ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ప్రభుత్వం ఈ నెల 9 నుంచి ప్రారంభించింది. 19 వరకు కొనసాగనుంది. ఇప్పటి వరకు బడిబాట కార్యక్రమం ద్వారా ఈ విద్యా సంవత్సరం 484 మంది విద్యార్థులను కొత్తగా వివిధ ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లోకి ప్రవేశాలను జిల్లా విద్యాశాఖ కల్పించింది.

11జీజీ02- నెమలిపింఛను మాలధారణముతో నాగేంద్రుడు

నాగేంద్రుడికి ప్రత్యేక అలంకరణ



గీసుగొండ, జూన్ 11: ఊకల్‌లోని ప్రసిద్ధ నాగ స్రుహ్మణ్యశ్వరస్వామి ఆలయంలో అశ్లేష నక్షత్ర (సర్ప నక్షత్రం) పురస్కరించుకొని మంగళవారం నాగేంద్రుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మేరకు నెమలి ఈకలతో తయారుచేసిన మాలను అలంకరించారు. ఈ సందర్భంగా స్వామివారిని, వల్లికిని మల్లెపూలతో అలంకరించి అభిషేకాలు నిర్వహించారు. వరంగల్‌కు చెందిన మడిపల్లి భరత్‌గౌడ్ తమిళనాడులోని పళనిక్షేత్రంలో తయారు చేసిన నెమలీకల మాలను స్వామివారికి బహూకరించారు. తోట కిరణ్‌గౌడ్ దంపతులు రూ.2,51,000లను, గోపగాని శోభన్‌బాబు, సాత్విక దంపతులు రూ.10వేలను విరాళంగా అందచేశారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు సముద్రాల సుదర్శనా చార్యులు, శ్రీహర్షాచార్యులు, ఎంపీటీసీ వీరారావు, ప్రముఖ కాంట్రాక్టర్ మారుపాక సుధాకర్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు.

చట్టవ్యతిరేక పనులకు పాల్పడొద్దు: ఏసీపీ

మట్టెవాడ, జూన్ 11: చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ హెచ్చరించారు. రంగంపేట ప్రాంతానికి చెందిన భైరపాక వినయ్‌పై మంగళవారం రౌడీషీట్ తెరిచినట్లు తెలిపారు. భైరపాక వినయ్‌పై 2019 నుంచి 2024 వరకు వరంగల్ మట్టెవాడ పోలీసు స్టేషన్‌లో, ఇంతేజార్‌గంజ్ పోలీసు స్టేషన్‌లలో పలు కేసులు నమోదు అయ్యాయని, ప్రభుత్వ ఉద్యోగులపై దాడి, ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించడం, బెదిరించి డబ్బులు ఇతర వస్తువులు దోచుకోవడం, స్త్రీలతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు: కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, జూన్ 11: లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ ప్రావీణ్య హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశపు మందిరంలో జిల్లాస్థాయి మల్టీమెంబర్ అప్రోపియట్ అథారిటీ కమిటీ సమావేశం జరిగింది. ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ జడ్జి బీవీ నిర్మలా గీతాంబతో కలిసి కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని ప్రతీ స్కానింగ్ సెంటర్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తనిఖీ చేసి ఫొటోలు తీయాలన్నారు. సంబంధిత ఫారంలు తప్పని సరిగా చెక్ చేయాలని, అనుమానం ఉన్న స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేయాలని ఆదేశించారు. యుక్త వయస్సులో వచ్చే మార్పులపై అన్ని కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సమావేశంలో డీసీపీ రవి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ప్రకాశ్, ప్రాజెక్టు అధికారి పద్మశ్రీ, మాస్ మీడియా అధికారి అనిల్, ఏసీపీ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ఉద్యోగ సంఘాలు

ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికలను విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్యను ఉద్యోగ సంఘాల నేతలు కలిసి పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ ఎన్నమనేని జగన్ మోహన్‌రావు ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డీసీవో సంజీవరెడ్డి, జడ్పీ సీఈఓ రామిరెడ్డి, టీజీవో ప్రధాన కార్యదర్శి ఫణి కుమార్, డాక్టర్ ప్రవీణ్ కుమార్, ఈగ వెంకటేశ్వర్లు, సురేశ్ కుమార్, చంద్రశేఖర్, మాధవరెడ్డి, రాజేష్ కుమార్, నాగ నారాయణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య



తమిళనాడు అధికారులతో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

పారిశుధ్య నిర్వహణపై అధ్యయనానికి తమిళనాడు బృందం

వరంగల్ కార్పొరేషన్, జూన్ 11 : గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ చాలా కాలంగా శానిటేషన్ విభాగంలో చేపడుతున్న కొత్త ఆవిష్కరణలు, సిబ్బంది పని తీరు అవగతం చేసుకునేందుకు నగరంలో తమిళనాడు రాష్ట్ర మునిసిపల్ అధికారుల బృందం మంగళవారం పర్యటించింది. ముందుగా వారు నగర మేయర్ గుండు సుధారాణి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.తర్వాత నగరపాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేను క్యాంపు కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. వారు సైతం అతిథులను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా సుధారాణి బల్దియాలో అమలు చేస్తున్న అత్యాధునిక శానిటేషన్ పద్ధతులను వివరించారు. తర్వాత అమ్మవారిపేటలోని కేంద్రాన్ని సందర్శించి మలశుద్ధీకరణ సామర్థ్యం వివరిస్తూ, మరో 150ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన మిషనరీ త్వరలో వస్తుందని మేయర్ వెల్లడించారు. మేయర్ మాట్లాడుతూ.. 11420 టోల్‌ఫ్రీ నెంబర్ ద్వారా ప్రజలకు అవగాహన కలిగిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బల్దియా శాని టేషన్ ఎంహెచ్‌వో మల్లం రాజేశ్, ఆస్కి ప్రతినిధులు డాక్టర్ రాజ్‌మోహన్‌రెడ్డి, ఓంప్రకాశ్ తమిళనాడు మునిసిపల్ అధికారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

సంగెం, జూన్ 11: మండలంలోని పలు గ్రామాలకు చెందిన వారు ఇటీవల మృతిచెందగా పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి బాధిత కుటుంబాలను పరామర్శించారు. మం గళవారం మండలంలోని మొండ్రాయి, నార్లవాయి, తిమ్మాపురం గ్రామాల్లో దామెరుప్పుల సారయ్య, చల్లా రామ క్క, రొట్టె లచ్చమ్మ, బండారి చంద్ర కళల కుటుంబ సభ్యులను ఓదార్చా రు. ఈసందర్భంగా మృతిచెందిన వారి చిత్రపటాలకు పూలమాలు వేసి నివాళులర్పించారు. మృతుల కుటుంబాలను ఆదుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలశాఖ అధ్యక్షుడు పసునూరి సారంగపాణి, వైస్ ఎంపీపీ బుక్క మల్లయ్య, సంగెం సొసైటీ ఛైర్మన్ వేల్పుల కుమారస్వామి, మండల కో ఆప్షన్ మెంబరు మన్సూర్ అలీ పాల్గొన్నారు.

ఘనంగా శతాధిక వృద్ధురాలి పుట్టినరోజు



లక్ష్మితో కుటుంబ సభ్యులు

గీసుగొండ, జూన్ 11: ధర్మారంనకు కూస లక్ష్మి వందో జన్మదిన వేడుకలను ఆమె కుటుంబ సభ్యులు ఘనంగా మంగళవారం జరుపుకున్నారు. లక్ష్మి భర్త ఆగయ్య(స్వాతంత్ర సమయోధుడు) గతంలోనే మృతిచెందాడు. మూడు తరాల వారు ఒక్కచోటికి చేరటంతో ఆ కుటుంబ సభ్యులందరూ పరవశించి పోయారు. చిన్నపుడు అమ్మ నేర్పిన హితోక్తులను గుర్తుచేసుకుంటు అమ్మవడిలో ఒదిగిపోయారు. కార్యక్రమంలో లక్ష్మి కుమారులు శంకర్‌రెడ్డి, మాధవరెడ్డి, అల్లుళ్ల జి.మల్లారెడ్డి, ఏడాకుల లింగారెడ్డి, గూడ యాదగిరిరెడ్డి, కూమార్తెలు సావిత్రి, అన్నమ్మ, పద్మ, మనమరాళ్లు, మనవళ్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య



మామునూరులో ప్రచారం చేస్తున్న ప్రిన్సిపాల్

శంభునిపేట, జూన్ 11: ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని రంగశాయిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సి పాల్ కె.శోభాదేవి తెలిపా రు. రంగశాయిపేట ప్రభు త్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియేట్‌లో ప్రవే శాల కొరకు ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో అధ్యాపకులు మంగళవారం మాము నూరులో ప్రచారం నిర్వహించారు. ఇటీవల పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థుల ఇళ్లకు వెళ్ళి తల్లిదండ్రులు, విద్యార్థులకు అవగాహన కల్పించారు.

రాజకీయ శిక్షణ పోస్టర్ ఆవిష్కరణ

ఖిలావరంగల్, జూన్ 11: ఈనెల 18 నుంచి 20 వరకు యాదాద్రి, భువనగిరి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని దళిత హక్కుల పోరాటా సమితి వరంగల్ జిల్లా అధ్యక్షుడు సంఫీ ఏలేందర్ కోరారు. మంగళవారం శివనగర్‌లోని సంస్థ కార్యాలయంలో డీహెచ్‌పీఎస్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 18 నుంచి 20 వరకు భువనగిరి జిల్లా, యాదగిరి గుట్ట, లక్ష్మీనర్సింహస్వామి ఫంక్షన్ హాల్‌లో శిక్షణ తరగతులను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్ను రవి, మండల కార్యదర్శి రాచర్ల రాజేందర్ పాల్గొన్నారు.

వీధి కుక్కల వృద్ధికి చెక్

3వ పేజీ తరువాయి

బల్దియా సిబ్బందికి సమాచారం ఇవ్వాలి. మునిసిపల్ జవాన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, శానిటరీ సూపర్‌వైజర్, వెటర్నరీ డాక్టర్, సీఎంహెచ్‌వోకు ఫోన్‌లో కానీ వాట్సాప్‌లో కానీ సమాచారం ఇవ్వొచ్చు. లేదంటే 18004251980, 9701999689,

బోర్ మోటార్ వైర్ చోరీ

గీసుగొండ, జూన్ 11: శాయంపేటహవేలిలోని బీసీ శ్మశానవాటికలో ఇటీవల ఏర్పాటు చేసిన బోర్‌బావి కరెంటు వైరు మంగళవారం చోరీకి గురైనట్లు ఎంపీటీసీ భిక్షపతి తెలిపారు. స్థానికులే కొందరు అభివృద్ధి కంటకులుగా మారి ఆటంకాలు కల్పిస్తున్నారని ఆరోపించారు. చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

ఇంటర్ మార్కుల ఆధారంగా సీట్లను కేటాయించాలి: ఏఐవైఎఫ్



కాశిబుగ్గ జంక్షన్‌లో ఆందోళన నిర్వహిస్తున్న నాయకులు

వరంగల్ సిటీ, జూన్ 11:ఇంటర్ మార్కుల ఆధారంగా విద్యార్థులకు వైద్య కళాశాలల్లో సీట్లను కేటాయించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ వలీఉల్లా ఖాద్రీ డిమాండ్ చేశారు. మంగళవారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో కాశిబుగ్గ జంక్షన్‌లో ఆందోళన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరై ఖాద్రీ మాట్లాడుతూ.. వైద్య కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ యుజీ ఫలితాల అవకతవకలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఈనెల 4న నీట్ ఫలితాలను విడుదల చేసిందని, అందులో 67 మంది విద్యార్థులకు 720 మార్కులకు 720 మార్కులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సుధీర్, గణేష్, సారయ్య, సుమన్, అమీర్ పాల్గొన్నారు.

ఏఐఎస్‌బీ వార్షికోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



వరంగల్‌సిటీ, జూన్ 11: కాశిబుగ్గ జంక్షన్‌లో 25న జరిగే అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఏఐఎస్‌బీ)74వ వార్షికోత్సవ పోస్టర్‌ను ఏఐఎస్‌బీ గ్రేటర్ వరంగల్ నాయకులు అఖిల్ మంగళవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఏఐఎస్‌బీ 1951లో పశ్చిమ బెంగాల్‌లో ఏర్పడి సుభాష్ చంద్రబోస్ ఆశయాలతో ముందుకు సాగుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపె అలుపెరగని పోరాటాలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా నాయకులు మోహన్, కుల్దీప్, రాజు, రణధీర్, విష్ణు, రవితేజ, సాయివర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ పులి రమేష్

వరంగల్ సిటీ, జూన్ 11: ఒక్క సీసీ కెమెరా పదిమంది పోలీసులతో సమానమని, వాటిని తప్పనిసరిగా ఏర్పాటు చేసుకునేందుకు ప్రయత్నం చేయాలని ఏనుమాముల సీఐ పులి రమేష్ అన్నారు. మంగళవారం ఏనుమాములలో పోలీసు జాగృతి కార్యక్రమం నిర్వహించారు. సైబర్ క్రైంపై నాటకాన్ని ప్రదర్శించారు. పాటల ద్వారా జాగృతి పరిచేందుకు ప్రయత్నించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీఐ రమేష్ మాట్లాడుతూ.. గ్రామంలో ఎవరైనా అనుమానాస్పదంగా కనబడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, అలాగే గుట్కా, మట్కా, గంజాయి అమ్మడం, వాటిని కొనుగోలు చేయడం లాంటివి జరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. రైతులు విత్తనాలు తీసుకున్నప్పుడు పక్కాగా బిల్లు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీకాంత్,కళాబృందం ఇంచార్జి ఏఎస్ఐ నాగమణి పాల్గొన్నారు.



పంట ప్రదర్శనలలో శాస్త్రవేత్తలతో రైతులు

కందితో నికర ఆదాయం

వరంగల్ వ్యవసాయం, జూన్ 11: పత్తిలో అంతర్ పంటగా కంది పంటతో సాగు చేస్తూ, నికర ఆదాయన్ని పొందవచ్చని వరంగల్ ప్రాంతీయ పరిశోధన స్థానం(ఆర్ఏఆర్ఎస్) సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ ఆర్.ఉమారెడ్డి అన్నారు. మంగళవారం ఆర్ఏఆర్ఎస్‌లో అఖిల భారత సమన్వయ పరిశోధన పథకం, కంది, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఆధ్వర్యంలో కంది ప్రథమ శ్రేణి ప్రదర్శనలు నిర్వహించారు. ముఖ్యఅతిథి ఉమారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో వరి, పత్తి తర్వాత స్థానం కంది పండదేనన్నారు. అపరాల సాగు పెంచాల్సిన అవసరం చాలా ఉందని తెలిపారు. విశిష్టఅతిథిగా హాజరైన ప్లాంట్ బ్రీడింగ్, అపరాల విభాగం అధిపతి ఎస్. సంధ్యకిషోర్ మాట్లాడుతూ.. 2023లో రాష్ట్రంలో 4.7 లక్షల ఎకరాల్లో కంది పంట సాగు చేశారని, ఈ సంవత్సర 2024లో 8.10లక్షల ఎకరాలకు పెంచి సాగు చేసేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు.

ఉపాధి పనుల సామాజిక తనిఖీ



సమావేశంలో మాట్లాడుతున్న కౌసల్యాదేవి

గీసుగొండ, జూన్ 11: మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ, ఆడిట్‌లను మంగళవారం నిర్వహించారు. డీఆర్‌డీవోకౌసల్యాదేవి మాట్లాడుతూ మండలంలో మొత్తం రూ.1,73,86,951 ఈజీఎస్ పనులు నిర్వహించినట్లు చెప్పారు. కూలీలకు రూ.1,60,72,725 చెల్లించగా, మెటీరియల్‌కు రూ. 13,14,226 చెల్లించినట్లు చెప్పారు. మస్టర్‌లు, ఉపాధి కూలీల పేర్లు, అటెండెన్స్ రిజిస్టర్‌లను పరిశీలించారు. బుధవారం కూడా ఆడిట్ జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమగాని సౌజన్య, ఎంపీడీవో కృష్ణవేణి, ఎంపీటీసీలు వీరారావు, సామాజిక తనిఖీ ఏపీసీ అంజాగౌడ్, ఎస్సార్పీ రమేష్, జిల్లా విజిలెన్స్ అధికారులు మాధవి, భిక్షపతి, క్వాలిటీ కంట్రోల్ అధికారులు హరీషా, ఏఈ పీఆర్ సుధాకర్, ఫారెస్టు ఎఫ్‌బీవో సమ్మయ్య, ఏపీవో చంద్రకాంత్, కార్యదర్శులు పాల్గొన్నారు.

'రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌ని సక్సెస్ చేయండి'

ఖిలావరంగల్, జూన్ 11: ఈనెల 23న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందులో జరిగే భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌ను విజయవంతం చేయాలని సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆరెల్లి కృష్ణ కోరారు. మంగళవారం శివనగర్‌లోని గోడౌన్‌లో జిల్లా అధ్యక్షుడు పసునూరి రాజు అధ్యక్షతన రాష్ట్ర జనరల్ కౌన్సిల్ కరపత్రాన్ని (పోస్టర్)ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఏర్పడిన సంకీర్ణ ప్రభుత్వం గతంలో చేసిన కార్మికుల వ్యతిరేక చట్టాలను, రైతాంగానికి వ్యతిరేకంగా చేసిన చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. చంద్రబాబునాయుడు, నితీష్‌కుమార్‌లు ప్రధాని మోదీ నాడు చేసిన ప్రజా వ్యతిరేకంగా చేసిన వివిధ చట్టాలను జన బహుళ్యానికి ఉపయోగపడే మెరుగైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నున్న అప్పారావు, కార్మిక నాయకులు ఉసికె రాజయ్య, లాదళ్ళ ఎల్లయ్య, కటుకూరి చిన్నస్వామి, లక్ష్మి, వెంకటేష్, రాజు ఏలియా పాల్గొన్నారు.

బాలుడి అప్పగింత



వరంగల్ చౌరస్తా, జూన్ 11: వరంగల్ రైల్వే స్టేషన్ ప్రాంతంలో ఏడుస్తూ అటుఇటు తిరుగుతున్న లక్కు నిశాద్ అనే బాలుడిని బ్లూ కోర్టు పోలీసులు గుర్తించి ఇంతేజార్‌గంజ్ పోలీసు స్టేషన్‌కు మంగళవారం తీసుకొచ్చారు. బాలుడిని విచారించి బాలుడి తండ్రి ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం బడిగావ్ గ్రామానికి చెందిన నిరంజన్ అని వరంగల్‌లో పెయింటింగ్ పనులు చేస్తూ మద్యానికి బానిసయ్యాడని కొడుకును పట్టించుకోకపోవడంతో బాలుడు స్టేషన్ పరిసర ప్రాంతంలో ఏడుస్తూ కనిపించాడని సీఐ మచ్చ శివకుమార్ తెలిపారు. బాలుడి తండ్రిని పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి బాలుడిని తండ్రికి అప్పగించడం జరిగిందని సీఐ తెలిపారు.

విద్యుత్ స్తంభాలు తొలగించరూ..

ఖిలావరంగల్, జూన్ 11: ఖిలావరంగల్ కాపువాడలో ఏడాదిగా విరిగిపడిన విద్యుత్ స్తంభాన్ని అధికారులు తరలించడకుండా ఇంటి ముందే ఉంచడంతో స్థానికులు ఇబ్బందిపడుతున్నారు. గత సంవత్సరం గాలి, దుమారానికి కాపువాడలో శిథిలావస్థకు చేరిన స్తంభం విరిగి ఓ వైపునకు ఒరిగి, ప్రమాదకరంగా మారడంతో దానిని సిబ్బంది ఆ స్తంభాన్ని కట్ చేశారు. అనంతరం అటుగా ఉన్న కాలనీకి చెందిన విద్యుత్ కనెక్షన్‌లను మరో స్తంభానికి ఇచ్చారన్నారు. తొలగించిన విద్యుత్ స్తంభాలు ఇళ్ల ముందే ఉండడంతో ఇంట్లోకి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. మరోచోట స్తంభం ఒక వైపునకు వంగి ప్రమాదకరంగా మారినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. కాపువాడ నుంచి కొప్పులవారి కాలనీకి వెళ్ళుక్రమంలో రాత్రులు విద్యుత్‌దీపాలు లేక చీకట్లో వాహనాలు వచ్చి, బాటసారులను ఢీకొనడంతో పలువురు గాయాలపాలవుతున్నారన్నారు.



ఇంటికి అడ్డంగా స్తంభం



ప్రమాదకరంగా సర్వీస్ వైర్లు



విద్యుత్ వినియోగదారుల సదస్సును సద్వినియోగం చేసుకోవాలి

ఖానాపురం, జూన్ 11: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఈనెల 13న(రేపు) నిర్వహించే విద్యుత్ వినియోగదారుల సదస్సును సద్వినియోగం చేసుకోవాలని ఏఈ సంపత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు మార్చటం, వోల్టేజ్ హెచ్చు తగ్గులు, డిస్ట్రిబ్యూషన్ సిస్టం పెంపుదల, లోపాలు ఉన్న మీటర్లు మార్చడం, నూతన సర్వీసులు మంజూరు, అదనపు లోడ్ క్రమబద్ధీకరణ, సర్వీసు పేరు మార్పు, వాడకానికన్నా హెచ్చు మొత్తంలో గల బిల్లులు, కేటగిరి మార్పు, సర్వీసు రద్దు మొదలకు వాటికి సంబంధించి వినియోగదారులు వ్రాత పూర్వకంగా ఈ సదస్సులో ఫిర్యాదులు అందించవచ్చని తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.00గంట వరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. మండలంలోని వినియోగదారులతో పాటు నర్సంపేట రూరల్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రోడ్డు సౌకర్యం కల్పించాలని వినతి


తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగికి వినతి పత్రం అందజేస్తున్న రైతులు

నర్సంపేట టౌన్, జూన్ 11: నర్సంపేట మండలం మగ్దుంపురం ఊరచెరువు నెక్కొండ రోడ్డు వంపుకాలువ నుంచి ట్రాన్స్‌ఫార్మర్ ప్రక్కన వట్టె వాగు వరకు రైతులు తమ తమ పొలాల వద్దకు వెళ్లేందుకు రోడ్డు సౌకర్యంతో పాటు శిథిలమైన కాలువ స్థానంలో నూతన కాలువను తవ్వించాలని కోరుతూ రైతులు మంగళవారం నర్సంపేట తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మగ్దుంపురం ఎంపీటీసీ చీకటి స్వరూప ఓదయ్యగౌడ్ మాట్లాడుతూ పొలాలకు వెళ్లేందుకు సరైన రోడ్డు లేకపోవడంతో పాటు నీటి పారకం కోసం కాలువ లేకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు రోడ్డు సౌకర్యంతో పాటు కాలువ పునర్నిర్మాణం చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ ఇస్లావత్ గోపి, మాజీ సర్పంచ్ అరుణశ్రీనివాస్‌రెడ్డి, తిరుపతి, వెంకన్న, సతీష్, ఈర్య, శంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి


సందీప్(ఫైల్)

నెక్కొండ, జూన్ 11: రైలు నుంచి జారి పడి యువకుడు మృతి చెందిన ఘటన వరంగల్ జిల్లా నెక్కొండ రైల్వే స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాది కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండలం నెహ్రూనగర్‌కు చెందిన దనసరి సందీప్ (25) తన మిత్రుడు మూతి రాజశేఖర్‌తో కలసి మంగళవారం మహబూబాబాద్ నుంచి షిరిడి ఎక్స్‌ప్రెస్‌లో సికింద్రాబాద్ వెళ్తున్నాడు. ఈ క్రమంలో నెక్కొండ- ఎలుగూరు రైల్వే స్టేషన్ల మధ్యగల కిలోమీటర్ నెంబరు 412/6-8 వద్ద రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. సందీప్ హైదరాబాద్‌లో ప్రయివేటు డ్రైవర్‌గా పని చేస్తున్నట్లుగా సమాచారం. కేసు నమోదు చేసుకున్న రైల్వే పోలీసులు శవపంచనామా నిర్వహించి మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎంలో భద్రపరిచినట్లు తెలిపారు.

ఆదమరిస్తే అంతే..!

• రోడ్డుపై గుంత • ప్రమాద సూచికగా.. ముళ్లకంప


రాయపర్తిలో ప్రమాదకరంగా ఉన్న గుంత

రాయపర్తి, జూన్ 11: మండలకేంద్రం నుంచి పెర్కవేడు గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై గుంత ఏర్పడడంతో అటు గా వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో ఆదమరిచి వెళితే ప్రమాదానికి గురయ్యే అవకాశాలు ఉన్నాయని, అధికారులు వెంటనే రోడ్డుపై ఏర్పడిన గుంతను పూడ్చాలని కోరుతున్నారు. అటుగా వైన్స్ షాపులు సైతం ఉండడంతో ప్రతినిత్యం రహదారి రద్దీగా ఉంటోంది. గుంతను అధికారులు పూడ్చకపోవడంతో స్థానికులు గుంతను పసిగట్టేందుకు అందులో ముళ్ల పొదలను వేసి ఉంచారు. ఇప్పటికైనా దీనిపై దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

పనులను త్వరగా పూర్తి చేయాలి

అధికారులను ఆదేశించిన కలెక్టర్ ప్రావీణ్య

మెడికల్ కళాశాల, పలు పాఠశాలల పనుల పరిశీలన


రామాలయం వీధి పాఠశాలలో టీచర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య


ఎంపీపీఎస్ పాఠశాలలో (నల్లాల) అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

నర్సంపేట, జూన్ 11: నర్సంపేట పట్టణ శివారులోని ప్రభుత్వ వైద్యకళాశాల భవననిర్మాణ పనులను అధికారులతో కలిసి కలెక్టర్ ప్రావీణ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె కళాశాలకు సంబంధించిన నక్షాను పరిశీలించాయి. భవనంలో నిర్మాణ దశలో ఉన్న గదులను, జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్యకళాశాల భవననిర్మాణ పనులు 80 శాతం పూర్తయ్యాయని మిగిలిన 20 శాతం పనులను రెండు నెలల్లో పూర్తిచేసి కళాశాల భవనం అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ కిషన్ నాయక్, ఆర్డీవో కృష్ణవేణి, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోపాల్, డాక్టర్ మనోజ్‌లాల్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని కస్తూరిబాయి మహిళామండలిలో మహిళలు, స్త్రీగతులు అనే అంశంపై జరిగిన సదస్సులో కలెక్టర్ పాల్గొన్నారు. కార్యక్రమంలోసదస్సు కన్వీనర్ తేరాల యుగేందర్, విశ్లేషకులు దామోదర్, మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలి

అమ్మఆదర్శపాఠశాలల అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. నర్సంపేట, పట్టణం మండలంలోని పలు పాఠశాలలను మంగళవారం సందర్శించి పనులను పరిశీలించారు. మండలంలోని రామవరం ఎంపీపీఎస్, పట్టణంలోని ఎంపీపీఎస్, ఉర్దూమీడియం, రామాలయం వీధిలోని అంగన్‌వాడీకేంద్రం, ప్రాథమిక పాఠశాలలను కలెక్టర్ సందర్శించి అమ్మఆదర్శపాఠశాలల కమిటీలు గుర్తించి చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రూ: 24కోట్ల వ్యయంతో సుమారు 556 ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మఆదర్శ కమిటీల ద్వారా అభివృద్ధి పనులను గుర్తించి చేపట్టడం జరుగుతుందన్నారు. కొన్ని పాఠశాలల్లో అభివృద్ధి పనులు పూర్తి కాగా, మరికొన్ని పాఠశాలలో పనులుతుదిదశలో ఉన్నాయన్నారు. వాటిని ప్రాశాలల ప్రారంభం కంటే పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, నోటుబుక్కులు అందజేయడం జరిగిందన్నారు. మహిళా సంఘాలచే కుట్టిన ఏకరూప దుస్తులను పాఠశాలలకు అందజేయడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. రామాలయం వీధి అంగన్‌వాడీ కేంద్రానికి భవనం నిర్మాణం కోసం రూ. 10లక్షలు ప్రత్యేక నిధులను మంజూరి చేసిన కలెక్టర్ ప్రావీణ్యకు అంగన్వాడీ టీచర్ నల్ల భారతి, సూపర్‌వైజర్ రూప్సీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సతీష్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

శతాధిక వృద్ధుల జన్మదిన వేడుకలు


లచ్చమ్మను సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న కుటుంబ సభ్యులు


ధర్మారంలో లక్ష్మితో కుటుంబ సభ్యులు

ఖానాపురం, జూన్ 11: మండలంలోని బుధరావుపేట గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు పులిగిల్ల లచ్చమ్మ 100వ పుట్టిన రోజు వేడుకలను మంగళవారం ఆమె నాలుగు తరాల వారసులు నిర్వహించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కుటుంబీకులు, బంధువులు కుటుంబ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించి వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా లచ్చమ్మ మనువడు పులిగిల్ల యాదగిరి మాట్లాడుతూ లచ్చమ్మ 1924లో జన్మించారని, మంగళవారం నాటికి 100 సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. నేటికి తన పనులు సొంతంగా చేసుకుంటూ ఆరోగ్యంగా ఉందన్నారు. వృద్ధురాలి భర్త లచ్చయ్య 22సంవత్సరాల కిందటే మరణించారన్నారు. లచ్చమ్మకు ముగ్గురు కుమారులు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. వారి కొడుకులు, మనువలు, మనువరాళ్లు, మునిమనవరాళ్లతో కలిపి మొత్తం 126మంది కుటుంబ సభ్యులు ఉన్నారని తెలిపారు. హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై, వైజాగ్ ప్రాంతాల్లో స్థిరపడ్డ కుటుంబీకులు అందరూ కలిసి ఆనందంగా వేడుకల్లో పాల్గొన్నట్లు తెలిపారు.

ధర్మారంలో..

గీసుగొండ: ధర్మారంనకు చెందిన కూస లక్ష్మి వందో జన్మదిన వేడుకలను ఆమె కుటుంబ సభ్యులు ఘనంగా మంగళవారం జరుపుకున్నారు. లక్ష్మి దివంగత స్వాతంత్ర సమయోధుడు ఆగయ్య సతీమణి. మూడు తరాల వారు ఒక్కచోటికి చేరటంతో ఆ కుటుంబ సభ్యులందరూ పరవశించి పోయారు. చిన్నప్పుడు అమ్మ నేర్పిన హితోక్తులను గుర్తుచేసుకుంటూ అమ్మవడిలో ఒదిగిపోయారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి కుమారులు శంకర్‌రెడ్డి, మాధవరెడ్డి, అల్లుండ్లు జి. మల్లారెడ్డి, ఏడాకుల లింగారెడ్డి, గూడ యాదగిరిరెడ్డి, కూమార్తెలు సావిత్రి, అన్నమ్మ, పద్మ, మనమరాల్లు, మనవలు పాల్గొన్నారు.

ప్రైవేటు విద్యాసంస్థల్లో అధిక ఫీజులను అరికట్టాలి

కలెక్టర్‌కు విద్యార్థి సంఘాల నాయకుల వినతి

నర్సంపేట, జూన్ 11 : ప్రైవే టు, కార్పోరేట్ విద్యాసంస్థల్లో అధికఫీజుల వసూళ్ళను అరికట్టాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పట్టణ శివారులోని మెడికల్ కళాశాల భవననిర్మాణ పనులను పరిశీలించడానికి మంగళవారం వచ్చిన జిల్లా కలెక్టర్ ప్రావీణ్యను కలిసి ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు దిడ్డి పార్థసారధి, ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అల్వాల నరేశ్ వినతిపత్రాన్ని అందజేశారు. జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజుల వసూళ్లను నియంత్రించాలని కలెక్టర్‌ను కోరామని వారు పేర్కొన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, టైలు, బెల్టులు యూనిఫామ్ విక్రయిస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లామని వారు పేర్కొన్నారు.

హైస్కూళ్లకే పరిమితమైన బడిబాట


బడిబాట ప్రారంభమైనా నెక్కొండ మండలం తోపనపల్లిలో తెరుచుకోని పాఠశాల

నెక్కొండ, జూన్ 11 : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ప్రారంభించిన బడిబాట కార్యక్రమం మండలంలోని హైస్కూలకే పరిమితమైందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈనెల 6న ప్రారంభమైన కార్యక్రమం 19 వరకు నిర్వహించాల్సి ఉండగా.. కేవలం హై స్కూళ్లలోనే నిర్వహిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. మండలంలో 13 హైస్కూళ్లు, 56 పీఎస్‌లు, 8 యూపీఎస్‌లు ఉండగా మొక్కుబడిగా కేవలం ఒకటి రెండు పాఠశాలల్లో బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలుస్తోంది. బడిబాట కార్యక్రమంలో భాగంగా ఈ నెల 11 గ్రామాలలో గ్రామ సభలను నిర్వహించి నూతనంగా ప్రభుత్వ పాఠశాలలో చేరనున్న విద్యార్థుల వివరాలను నమోదు చేయాల్సి ఉండగా కొన్ని గ్రామాల్లో ఉపాధ్యాయులు సభలను నిర్వహించలేదని పలు గ్రామాల ప్రజలు తెలిపారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

నాగేంద్రుడికి ప్రత్యేక అలంకరణ


నాగేంద్రుడికి నెమలి ఈకల దండ

గీసుగొండ, జూన్ 11: ఊకల్‌లోని ప్రసిద్ధ నాగసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో అశ్లేష నక్షత్ర(సర్ప నక్షత్రం) పురస్కరించుకొని మంగళవారం నాగేంద్రుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈమేరకు నెమలి ఈకలతో తయారుచేసిన మాలను అలంకరించారు. ఈ సందర్భంగా స్వామివారిని, వల్మీకిని మల్లెపూలతో అలంకరించి అభిషేకాలు నిర్వహించారు. వరంగల్‌కు చెందిన మడిపల్లి భరత్‌గౌడ్ తమిళనాడులోని పళని క్షేత్రంలో తయారుచేసిన నెమలీకల మాలను స్వామివారికి బహూకరించారు. తోట కిరణ్‌గౌడ్ దంపతులు రూ.2,51,000లను, గోపగాని శోభన్‌బాబు, సాత్విక దంపతులు రూ.10వేలను విరాళంగా అందచేశారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు సముద్రాల సుదర్శనాచార్యులు, శ్రీహర్షాచార్యులు, ఎంపీటీసీ వీరారావు, ప్రముఖ కాంట్రాక్టర్ మారుపాక సుధాకర్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల సామాజిక తనిఖీ



సమావేశంలో మాట్లాడుతున్న కౌసల్యాదేవి

గీసుగొండ, జూన్ 11: మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ, ఆడిట్‌లను మంగళవారం నిర్వహించారు. డీఆర్‌డీవో కౌసల్యాదేవి మాట్లాడుతూ మండలంలో మొత్తం రూ.1,73,86,951 ఈజీఎస్ పనులు నిర్వహించినట్లు చెప్పారు. కూలీలకు రూ.1,60,72,725 చెల్లించగా, మెటీరియల్‌కు రూ. 13,14,226 చెల్లించినట్లు చెప్పారు. మస్టర్‌లు, ఉపాధి కూలీల పేర్లు, అటెండెన్స్ రిజిస్టర్‌లను పరిశీలించారు. బుధవారం కూడా ఆడిట్ జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ భీమగాని సౌజన్య, ఎంపీడీవో కృష్ణవేణి, ఎంపీటీసీలు వీరారావు, సామాజిక తనిఖీ ఏపీసీ అంజాగౌడ్, ఎస్సార్పీ రమేష్, జిల్లా విజిలెన్స్ అధికారులు మాధవి, బిక్షపతి, క్వాలిటి కంట్రోల్ అధికారులు హరీషా, ఏఈ వీఆర్ సుధాకర్, ఫారెస్ట్ ఎఫ్‌బీవో సమ్మయ్య, ఏపీవో చంద్రకాంత్, కార్యదర్శులు పాల్గొన్నారు.

జీలుగ, పెసర విత్తనాల అదనపు కోటాను అందించాలి


ఏవో శశికుమార్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

చెన్నారావుపేట, జూన్ 11: రైతులకు, జిలుగ పెసర్ల విత్తనాల అదనపు కోటను అందించాలని ఎంసీపీఐయూ పార్టీ మండల కార్యదర్శి జన్ను రమేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఏవో శశికుమార్‌కు నకిలీ విత్తనాలు అరికట్టాలని, జిలుక, పెసర్ల విత్తనాల అదనపు కోటను పెంచాలని ఎంసీపీఐయూ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ రైతులకు సబ్సిడీ కింద అందించే వ్యవసాయ పనిముట్లు, పరదాలు, మందు పిచికారి చేసే పంపులు, నాగాండ్లను అందించాలన్నారు. విత్తనాలను ఎమ్మార్పీ దర కంటే ఎక్కువ అమ్మే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మొర్రి శ్రీను, సాంబయ్య, అచ్చనాయక్, గోరేమియా, తదితరులు పాల్గొన్నారు.

బోర్ మోటార్ వైర్ చోరీ

గీసుగొండ, జూన్ 11: శాయంపేటహవేలిలోని బీసీ శ్మశానవాటికలో ఇటీవల ఏర్పాటు చేసిన బోర్‌బావి కరెంటు వైరు మంగళవారం చోరీకి గురైనట్లు ఎంపీటీసీ భిక్షపతి తెలిపారు. స్థానికులే కొందరు అభివృద్ధి కంటకులుగా మారి ఆటంకాలు కల్పిస్తున్నారని ఆరోపించారు. చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలి


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్‌రాజు

దుగ్గొండి, జూన్ 11: గ్రామాలలో ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని దుగ్గొండి వైద్యాధికారి కిరణ్‌రాజు ఆదేశించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మంగళవారం ఏఎన్ఎం, ఆశాకార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ పాల్గొని మాట్లాడుతూ గ్రామాలలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను చైతన్య పరచాలన్నారు. గ్రామాలలో గర్భిణులను గుర్తించి పీహెచ్‌సీలలోనే ప్రసవం జరిగే విధంగా వారిని చైతన్యం చేయాలన్నారు. నెల నెల ఆస్పత్రిలో వైద్య పరీక్షలు జరుపుకునేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. టీకాలను వేయడంలో నిర్లక్ష్యం చేయరాదన్నారు. ఈసమావేశంలో హెచ్ఈవో సాంబయ్య, సీహెచ్‌వో సలోమి, పీహెచ్ఎన్ మనోజ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

సంగెం, జూన్ 11: మండలంలోని పలు గ్రామాలకు చెందిన వారు ఇటీవల మృతిచెందగా పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి బాధిత కుటుంబాలను పరామర్శించారు. మంగళవారం మండలంలోని మొండ్రాయి, నార్లవాయి, తిమ్మాపురం గ్రామాల్లో దామెరుప్పులు సారయ్య, చల్లా రామక్క, రొట్టె లచ్చమ్మ, బండారి చంద్రకళల కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈసందర్భంగా మృతిచెందిన వారి చిత్రపటాలకు పూలమాలు వేసి నివాళులర్పించారు. మృతుల కుటుంబాలను ఆదుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలశాఖ అధ్యక్షుడు పసునూరి సారంగపాణి, వైస్ ఎంపీపీ బుక్క మల్లయ్య, సంగెం సొసైటీ చైర్మన్ వేల్పుల కుమారస్వామి, మండల కో ఆప్షన్ మెంబరు మన్సూర్ అలీ పాల్గొన్నారు.

వీధి కుక్కల వృద్ధికి చెక్

(3వ పేజీ తరువాయి)

బల్దియా సిబ్బందికి సమాచారం ఇవ్వాలి. మునిసిపల్ జవాన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, శానిటరీ సూపర్‌వైజర్, వెటర్నరీ డాక్టర్, సీఎంహెచ్‌వోకు ఫోన్‌లో కానీ వాట్సాప్‌లో కానీ సమాచారం ఇవ్వొచ్చు. లేదంటే 18004251980, 9701999689, 8919130853 టోల్‌ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేయవచ్చు. ప్రజల ఫిర్యాదులు స్వీకరించిన అధికారులు వెంటనే సంబంధిత ప్రదేశానికి అక్కడి మునిసిపల్ జవాన్ల సాయంతో వీధి కుక్కలను పట్టుకుని ఏబీసీ సెంటర్‌కు తరలిస్తారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

నెక్కొండ , జూన్ 11 : పల్లెలకు పక్కా రోడ్డు సౌకర్యం ఉంటే గ్రామాలు అన్ని రంగాలో అభివృద్ధి చెందుతాయని నర్సంపేట టీపీసీసీ మెంబరు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి అన్నారు. మండలంలోని అమీన్‌పేటలో నూతనంగా నిర్మాణం చేస్తున్న సీసీ రోడ్డు పనులను మంగళవారం ఆయన ప్రారంభించారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఈ రోడ్డు నిర్మాణానికి రూ. 4 లక్షలను మంజూరు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బక్కి అశోక్, అమీన్‌పేట మాజీ సర్పంచ్ గరికపాటి హనుమంతరావు, నాయకులు కుసుమ చెన్నకేశవులు, రాచకొండ రఘు, రావుల మైపాల్‌రెడ్డి, చిలుపూరి యాకయ్య, కోటేశ్వర్‌రావు, షెక్ యాకుబ్‌పాషా, సుధాకర్, పీఆర్ ఏఈ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కష్టాల వెంబడి..

(3వ పేజీ తరువాయి)

కానున్నాయి. నర్సం పేట మునిసిపాలిటీ పరిధిలోని సర్వాపురం ప్రైమరీ పాఠశాలలో 40మంది విద్యార్థులున్నారు. పాఠశాల భవనం మాత్రం శిథిలావస్థలో ఉంది. పదేళ్లుగా ఇక్కడి పరిస్థితి మారడం లేదు. మన ఊరు, బస్తీ, మన బడి తొలి విడతలో ఈ పాఠశాలను గుర్తించకపోవడం విద్యార్థుల తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. చినుకు పడితే పాఠశాలకు సెలవు ప్రకటించే దుస్థితి నెలకొంది.

మొదటి రోజే యూనిఫామ్, పుస్తకాలు ..

పాఠశాలల పునఃప్రారంభం తొలిరోజే విద్యార్థులకు యూనిఫామ్‌లతోపాటు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు అందజేయనున్నారు. మంత్రి కొండా సురేఖ బుధవారం మధ్యాహ్నం ఖిలావరంగల్‌లోని ఆరెల్లి బుచ్చయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు అందించనున్నారు. వివిధ ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఒక్కో జత చొప్పున 38,020 యూనిఫామ్స్ అందజేయనున్నారు. జిల్లాకు ఇప్పటికే 100 శాతం పుస్తకాలు వచ్చాయి. అందులో 86శాతం పుస్తకాలు పాఠశాలల్లో పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. వందశాతం నోట్ పుస్తకాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి.

● కొనసాగుతున్న బడిబాట..

ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ప్రభుత్వం ఈ నెల 9 నుంచి ప్రారంభించింది. 19 వరకు కొనసాగనుంది. ఇప్పటి వరకు బడిబాట కార్యక్రమం ద్వారా ఈ విద్యా సంవత్సరం 484 మంది విద్యార్థులను కొత్తగా వివిధ ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లోకి ప్రవేశాలను జిల్లా విద్యాశాఖ కల్పించింది.